# నాలుగు నూతన హయ్యర్ ఆర్టీసి బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే

- రూ.10ల విలువ మొదటి టికెట్ కొనుగోలు చేసిన ఎమ్మెల్యే...

- పలు ప్రైవేట్ వాహనాలపై కొరడా ఝుళిపించిన ఆర్టీసి జోనల్ చైర్మెన్





జిటిఎల్ ఆర్టిసి డిపో నూతన వాహనాలకు పచ్చజెండాలను ఊపుతూ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వైవిఆర్‌తో పాటు ముఖ్యఅతిథులు..,బస్సులో మొదటి ప్రయాణంకై కండెక్టర్ వద్ద నుండి టికెట్ కొనుగోలు చేస్తున్న ఎమ్మెల్యే



ఆర్‌టిసి చట్ట నిభంధనలను అతిక్రమిస్తున్న వాహనదారులకు జరిమానా విధింపులో ఆర్‌టిసి జోనల్ చైర్మెన్ మాల్యవంతం మంజుళ.

**గుంతకల్లు, నవంబర్ 24 ప్రభాతవార్త :** ప్రజలకు మెరుగైన సేవలతో సురక్షిత ప్రయాణంగా వారి గమ్యస్థానాల చేరికకు ఆర్‌టిసి వాహనాల ప్రాధాన్యతగా గుంతకల్లు ఆర్‌టిసి డిపో నుండి ఆదోని ప్రాంతంకు గురువార ం నాలుగు నూతన హయ్యర్ (అద్దె) బస్సులను ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ప్రారంభించారు. స్థానిక ఆర్‌టిసి డిపో మేనేజర్ బి.నారాయణస్వామి అద్వర్యంలో ముఖ్యఅతిథులుగా ఆయనతో పాటు ఆర్‌టిసి జోనల్ చైర్మెన్ మాళ్యవంతం మంజుళ, మున్సిపల్ వైస్‌చైర్మెన్ సి.బి.నైరుతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోరుతూ ప్రయాణీకుల పట్ల సమయపాలనగా నూతన బస్సుల ప్రవేశంకు శ్రీకారం చుట్టడం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన అభినందనీయమని కొనియాడారు. ప్రస్తుతం ప్రయాణీకుల సౌకర్యార్థం దినసరి ప్రయాణాలకు ఆలూరు మీదుగా ఆదోని ప్రాంతం వైపుకుగాను స్థానిక డిపో నుండి నూతనంగా 4 బస్సులు (అద్దె వాహనాలు) రోడ్డెక్కడం, వాటిని తాను ప్రారంభిస్తుండటం చాలా ఆనందంగా ఉందన్నారు. గుంతకల్లు ఆర్‌టిసి డిపో పురోభివృద్ధిని కాంక్షిస్తూ డిపోలో ఉన్న సమస్యల పరిష్కారంకై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రివర్యులతో కూడా చర్చలు జరిపి గుంతకల్లు నుండి వివిద ప్రాంతాలకు మెరుగైన సేవలతో నూతన సాంకేతిక ఒరవడితో కూడిన మరిన్ని నూతన బస్సుల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్‌లు పచ్చజెండా ఊపుతూ నూతన బస్సు ప్రారంభోత్సవంకు శ్రీకారం చుట్టారు. ఈక్రమంలోనే ఆయన తొలి ప్రయాణీకుడిగా కండెక్టర్ నుండి రూ.10ల విలువ గల టికెట్టును కొనుగోలు చేస్తూ సదరు బస్సులో ప్రయాణిస్తూ ఆర్‌టిసి డిపో నుండి బస్టాండ్‌కు చేరుకోవడం గమనార్హం. తదుపరి ఆర్‌టిసి జోనల్ చైర్మెన్ మాట్లాడుతూ ఆర్‌టిసి అభివృద్ధిలో వైకాపా ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు ధీటుగా ముఖ్యమంత్రి జగనన్న పాలన సాగిస్తున్నారన్నారు. అనంతరం పాత్రికేయులు అడిగిన ప్రశ్నలలో భాగంగా ఆర్‌టిసి బస్టాండ్ ప్రయాణాల సౌకర్యంలో ట్రాఫిక్ సమస్యతో ప్రయాణీకులకు ప్రమాదకరంగా ఉందని, బస్టాండ్ ఆవరణంలోకి ప్రైవేట్ వాహనాలుగా ద్విచక్ర,ఆటోలు,కార్లు వంటి వాహనాలు యధేశ్చగా రాకపోకలు సాగిస్తున్న తీరుండగా భద్రతల పట్ల ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు ప్రయాణీకులు తమ ఇబ్బందులుగా ఉందని వాపోతున్నట్లు ఆమె దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. దీంతో ఆమె స్పందిస్తూ తక్షణ చర్యలుగా ఆమె స్వయంగా డిపో మేనేజర్‌తో పాటు ఆర్‌టిసి అధికార సిబ్బందితో సంయుక్తంగా బస్టాండ్ ఆవరణంలోకి అటు ఇటు రాకపోకలుగా ఉన్న పలు వాహనాలపై తనదైనశైలిలో కొరడా ఝుళిపించారు. అంతకుమునుపు పలువురు ఆటోడ్రైవర్లు తమ ఆటో వాహనాల నిలుపుకోవడానికి సమస్యగా ఉందని, తమ పట్ల సానుభూతిగా వాహనాల నిలుపుదలకు స్థలం కేటాయించాలని కోరారు. ప్రస్తుతం ఆటో వాహనాలకు నిలయాలుగా ఉన్న ఆర్‌టిసి స్థలంలో అద్దెల ద్వారా ప్రస్తుతం నెలకు దాదాపు లక్షలాది రూపాయాలు ఆదాయం ఉండటంతో మీ వాహనాల నిలుపుదలకు సమస్య ఉందనడంలో అతిశయోక్తి లేదన్నారు. కాని ఆర్‌టిసి ఆదాయంకు గండిగా మారకుండా మీరు కూడా భాధ్యతగా సహకరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని హితవు చెప్పారు. బస్టాండ్ ప్రాంతంలో మీ మీ వాహనాల నిలుపుదలకు అనువైన స్థల పరిశీలనకు కొంత సమయం పడుతుందని ఆమె సుతిమెత్తగా సమాధానం ఇస్తూ దాట వేయడం గమనార్హం. కాగా ఆర్‌టిసి చట్ట నియమాల అతిక్రమణగా బస్టాండ్ ఆవరణంలోకి రాకపోకలు సాగిస్తున్న ఆయా వాహనదారులకు జరిమానాల విధింపుగా దాదాపు రూ.2వేలకు పైగా వసూలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ కార్యక్రమంలో ఆర్టీసి ఎస్‌టిఐ కృష్ణానాయక్, డిసి ఎస్.ఎర్రిస్వామి, ఎడిసిలు ఎస్ఎస్ వలి (డ్యామ్), హనుమంతు, ఎ.ఎల్.ఎన్.గౌడ్, హెచ్.నటరాజ్‌లతో పాటు పలువురు పిటిడి ఉద్యోగులు, కండక్టర్లు రహంతుల్లా, వన్నూరప్ప, జెపిఆర్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

# " గుంతకల్లు సచివాలయ ఉద్యోగుల సంఘం " కమిటీ ఎంపిక ఏకగ్రీవం

- అధ్యక్షుడుగా కె.రమేష్‌రావ్, ప్రధానకార్యదర్శిగా ఇంద్రసేనారెడ్డిలు



ఏకగ్రీవంగా ఎంపికైన నూతన " గుంతకల్లు సచివాలయ ఉద్యోగుల సంఘం " కమిటీ సభ్యుల బృందం.

**గుంతకల్లు, నవంబర్ 24 ప్రభాతవార్త :** నిరుద్యోగులను ఉద్యోగులుగా గుర్తింపునిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా వార్డు, గ్రామ సచివాలయాలు ఏర్పాటుతో ప్రజలకు అత్యంత చేరువగా వివిద ప్రభుత్వ పథకాల అమలుతో లబ్దిదారులకు చేరువుగా వారి సేవలతో రాష్ట్ర ప్రభుత్వంకు ఓవైపు మూలస ఒభాలుగా నిలుస్తున్నారనడంలో అతిశయోక్తి లేదు. ఈక్రమంలో రాబోవు రోజుల్లో వారి ఉద్యోగ భద్రతలకు భంగకరం కాకుండా తమ ఉద్యోగ ఉనికిని కాపాడుకోవడంలో రక్షణ దిశగా ప్రధానంగా కమిటీ ఏర్పాటు అవశ్యమన్న లక్ష్యంగా గుంతకల్లు పట్టణంలోని 37వార్డులకు సంబందించి ఆయా సచివాలయాల ఉద్యోగులు ఓ సంఘం ఏర్పాటుకు సన్నాహాలుగా మార్గం సుగమం చేశారు. గురువారం స్థానిక మార్కెట్‌యార్డు ప్రాంతంలో పట్టణంలోని సచివాలయాల ఉద్యోగులు సమావేశమై ఒక కమిటీ నిర్ధారణగా " గుంతకల్లు సచివాలయ ఉద్యోగుల సంఘం "గా నామకరణం చేశారు. ఈ సందర్భంగా సచివాయాల ఉద్యోగుల సమస్యలకు గాను, భవిష్యత్ కార్యాచరణకు గాను ఓ సంఘంగా ఏర్పడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో ఓ కమిటీగా ఏర్పడి ఉద్యోగ భద్రతల సత్ఫలితాల సాధనకు దోహదకారిగా ఉండాలని పిలుపునిస్తున్నామని పలువురు ఉద్యోగులు పేర్కొన్నారు. తదుపరి సమావేశంలో కమిటీ అధ్యక్షుడుగా కె.రమేష్‌రావు (వెల్ఫేర్ సెక్రెటరి), ప్రధాన కార్యదర్శిగా ఇంద్రసేనారెడ్డి (అడ్మిన్ సెక్రెటరి), సహాయ కార్యదర్శిగా మంజునాథ్ (ఎడ్యుకేషన్ సెక్రెటరి), కోశిధికారిగా శ్రీధర్ (శ్యానిటేషన్ కార్యదర్శి), ఉపాధ్యక్షులుగా వరప్రసాద్,అనిల్‌కుమార్, పుష్యమి,చిట్టిబాబు, విజయభారతి, సుదర్శన్,శ్రీనివాసులు,యోగానంద్, నబీరసూల్‌లతో పాటు మరో9మంది సంయుక్తకార్యదర్శులుగాను, మరికొందరు అధికార ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులు, ప్రచార కార్యదర్శులు, గౌరవ సలహాదారులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని ఓ ప్రకటనలో తెలిపారు.

# బిజెపికి అండగా ఉందాం..మన బ్రతుకులు మార్చుకుందాం..!

- రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు గుడిసె దేవానంద్



ప్రసంగిస్తున్న రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు గుడిసె దేవానంద్

**మడకశిర టౌన్, నవంబర్ 24 ప్రభాతవార్త :** దళితుల బ్రతుకులు బాగుపడాలంటే బిజెపికి అండగా ఉండాలని తద్వారా దళితులు అభ్యున్నతి సాధించ వచ్చని బిజెపి రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు గుడిసె దేవానంద్ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు వేల ఎస్సీ కాలనీలో సభలు నిర్వహించి దళితుల్లో కష్ట సుఖాలను తెలియపరిచి చైతన్య పరచడమే తమ లక్ష్యంగా బస్తీ సంపర్క అభియాన్ యాత్ర కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మూడు వేల హాస్టళ్లను మూసివేస్తేప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దళితుల విదేశీ చదువులకు తిలోదకాలు ఇచ్చారని ఆయన ఆరోపించారు. పేద ప్రజలకు ఆహార భద్రత కల్పించాలన్న సంకల్పంతోనే ప్రధాని నరేంద్రమోదీ ప్రతి వ్యక్తికి ఐదు కిలోలు చొప్పున ఐదు మందికి 25 కిలోల బియ్యాన్ని ఉచితంగా అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మడకశిర బిజెపి సీనియర్ నేతలు హనుమంతప్ప, బసవ రాజు, పట్టణ అధ్యక్షులు పురుషోత్తం శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. బస్తీ సంపర్క అభియాన్‌యాత్రలో భాగంగా కళాకారులచే మోదీ అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వాల ప్రదీప్ ప్రజా వ్యతిరేక కార్యకలాపాలు ఎండగడుతూ పాడిన పాటలు ఎంతో ఉత్సాహాన్ని బస్తీ వాసుల్లో కలిగించాయి.

# వక్కలిగ భవన సముదాయం నిర్మాణానికి సహకరించండి- అనంత రాజు



సభ్యత్వ నమోదు చేస్తున్న అనంత రాజు

**గుడిబండ, నవంబర్ 24 ప్రబాతవార్త :** మండల వ్యాప్తంగా మడక శిర తాలూకా సంఘం అధ్యక్షులు అనంత రాజు ఆధ్వర్యంలో కుంచిటిగ వక్కలిగ సభ్యత్వం నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం మండల పరిధిలోని సిసిగిరి గ్రామంలో సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో అనంతరాజు మాట్లాడుతూ.. సిసి గిరిగ్రామంలో 82 మంది సభ్యత్వం తీసుకున్నారని తెలిపారు. అలాగే వక్కలిగ సముదాయం భవనం నిర్మాణానికి విరివిగా విరాళాలు అందించి భవన నిర్మాణానికి సహకరించాలని కోరారు. తదనంతరం సర్పంచు యంజారేగౌడ్ 10000 సంఘం సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రెటరీ చౌడప్ప, ట్రెజరర్ ఎం.రంగనాథ్, డైరెక్టర్లు సిసిగిరి కాంతరాజు, లాయర్ రంగనాథ్, నరసింహారెడ్డి, రాజేష్, సర్పంచు డిఎల్ యంజారేగౌడ్, యంజారప్ప, కరేగౌడ్, శివశంకర్, భూతేష్, రవిచంద్ర, నాగరాజు, సిసిగిరి, కుంచిటిగ కులబాంధవులు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ కేసుల్లో వాహనాల వేలం ద్వారా రూ.7.43 లక్షల ఆదాయం

-హాజరైన ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ధనుంజయకుమార్

**ఉరవకొండ, నవంబర్ 24 ప్రభాతవార్త :** ఉరవకొండ సెబ్ స్టేషన్ ఆవరణంలో గురువారం సాయంత్రం జరిగిన ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాల వేలం ద్వారా 7,43,518 రూపాయల ఆదాయం సమకూరిందని స్థానిక సెబ్‌సీఐ మారుతిరావు తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ధనుంజయకుమార్ ఆధ్వర్యంలో ఒక కారుతోపాటు 2 ఆటోలు, 28 ద్విచక్రవాహనాలను వేలం నిర్వహించామన్నారు. వీటికి ఎంవీఐ 6,09,100 రూపాయలు అప్‌సెట్ ప్రైజ్‌గా నిర్ణయించగా వేలం ద్వారా 1,34,418 రూపాయలు అధికంగా ఆదాయం సమకూరిందని సీఐ వివరించారు.

# సంక్షేమ వసతిగృహాలను తనిఖీ చేసిన ప్రత్యేక అధికారి

-బీసీ, ఎస్సీ వసతిగృహాలు తనిఖీచేసి సమస్యలపై ఆరా



బీసీ సంక్షేమ వసతిగృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బు కొఠారి

**ఉరవకొండ, నవంబర్ 24 ప్రభాతవార్త :** పట్టణంలోని సాంఘిక సంక్షేమ వసతిగృహాలను గురువారం సాయంత్రం బీసీ సంక్షేమ వసతిగృహాల డిప్యూటీ డైరెక్టర్ కుష్బు కొఠారి తనిఖీ చేశారు. తొలుత ఇందిరానగర్‌లోని బీసీ బాలుర సంక్షేమ వసతిగృహాన్ని తనిఖీ చేసిన డీడీ అనంతరం ఆర్టీసీ డిపో ముందుగల ఎస్సీ బాలుర కళాశాల హాస్టల్, అనంతరం బాలికల కళాశాల వసతిగృహాలను తనిఖీ చేసి అక్కడి వసతులు, భోజనం తదితర అంశాలపై ఆరా తీశారు. విద్యార్థులతో సమావేశమైన డీడీ వసతిగృహాల్లో మెనూకు అనుగుణంగా భోజనం అందిస్తున్నారా, తాగునీరు, బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్ల సమస్యలు ఉన్నాయా అని తెలుసుకున్నారు. సమస్యలపై కలెక్టర్‌కు నివేదిక అందించి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని డీడీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట వార్డెన్లు ఓబులయ్య, షబానా తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో ఏవీఆర్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

-మొదటి, ద్వితీయ స్థానాల్లో నిలిచి సర్టిఫికేట్లు అందుకున్న విద్యార్థులు

**ఉరవకొండ, నవంబర్ 24 ప్రభాతవార్త :** సత్యసాయి జయంతోత్సవాల్లో భాగంగా సత్యసాయి సేవా సమితి నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఉరవకొండ పట్టణంలోని ఏవీఆర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచారు. గురువారం పాఠశాలలో జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ విక్రమ్ మాట్లాడుతూ వ్యాసరచన పోటీల్లో రాష్ట్రస్థాయిలో పాఠశాల విద్యార్థులు మొదటి, ద్వితీయ స్థానాల్లో నిలువడమే కాకుండా పోటీల్లో పాల్గొన్న ఇతర విద్యార్థులు సైతం సర్టిఫికేట్లు సాధించారని వివరించారు.

# ప్రభుత్వ వైద్యునిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి



ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

**గుంతకల్లు టౌన్, నవంబర్ 24 ప్రభాతవార్త :** విద్యార్థిని షేక్‌మాబునీ బేగం మృతికి కారకులైన ప్రభుత్వ వైద్యులు డాక్టర్ రావాంజినేయులుపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సిపిఐఎంఎల్ న్యూ డెమొక్రసి పార్టీ డివిజన్ కమిటీ కార్యదర్శి బి.సురేష్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయం నుండి ర్యాలీగా వచ్చి ప్రభుత్వాసుపత్రి ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను నడుపుతున్న ప్రైవేటు క్లీనిక్‌పై ఎక్కువ శ్రద్ధ చూపుతూ ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగుల పట్ల వైద్యుడు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఉర్దూ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న షేక్‌మాబునీబేగం అనారోగ్యంతో ఈ నెల 7వతేదీన ఆసుపత్రిలో చేరిందన్నారు. మూడు రోజుల పాటు ఆసుపత్రిలోనే వున్న విద్యార్థినికి సరైన వైద్యం అందించకపోగా నిర్లక్ష్యంగా వ్యవహరించి విద్యార్థిని మృతికి కారకుడయ్యారన్నారు. మృతి చెందిన విద్యార్థిని కుటుంబసభ్యులకు ప్రభుత్వం 50 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి వైద్యునిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, రంగస్వామి, ఆశాబేగం, రామాంజి, తదితరులు పాల్గొన్నారు.

# ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ఉరవకొండ విద్యార్థి ఆత్మహత్య..!

-కుటుంబ సమస్యలతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు లేఖ?

-జెడ్పీ సెంట్రల్ హైస్కూల్‌లో 10వ తరగతిలో టాపర్

-ఇడుపులపాయకు పయణమైన విద్యార్థుల తల్లిందులు



ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న గొల్ల ఈశ్వర్‌సాయి

**ఉరవకొండ, నవంబర్ 24 ప్రభాతవార్త :** పట్టణానికి చెందిన బీటెక్ విద్యార్థి గొల్ల ఈశ్వర్‌సాయి (18) కడప జిల్లా ఇడుపులపాయలోని ఏపీ ట్రిపుల్ ఐటీ రాజీవ్ నాలెడ్జ్ వాలీలో గురువారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. హాస్టల్‌లోని తన గదిలో పైకపు కొక్కానికి ఉరి బిగించుకొని మృతి చెందినట్లు ఉదయం ట్రిపుల్ ఐటీ వర్గాలు గుర్తించాయి. ఆత్మహత్య చేసుకోవడానికి ముందు అతను లేఖ రాసినట్లు సమాచారం. కుటుంబ సమస్యలకారణంగానే ఆత్మహత్య చేసుకొంటున్నట్లు అందులో పేర్కొన్నట్లు చెబుతున్నారు. పట్టణంలోని 4వ వార్డులో నివాసముండే గొల్ల నాగభూషణం, వీరవతి దంపతులకు ఇద్దరు సంతానం కాగా చిన్నవాడు గొల్ల ఈశ్వర్‌సాయి కాగా పెద్ద కుమార్తె పావని డిగ్రీ సెకెండర్ ఇయర్ చదుతోందని సమాచారం. పట్టణంలోని జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి వరకు చదివిన ఈశ్వర్‌సాయి 2020-21 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పరీక్షల్లో 586/600 మార్కులు (9.8 జీపీఏ) సాధించి టాపర్‌గా నిలిచి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడు. ఈక్రమంలో విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడంతో అటు తల్లిదండ్రులు, ఇటు పాఠశాల ఉపాధ్యాయులు షాక్‌కు గురవుతున్నారు. విద్యార్థి లేఖలో చెప్పినట్లు కుటుంబ సమస్యలేవీ లేవని, తల్లిదండ్రులు అన్యోన్యంగానే ఉంటున్నారని స్థానికులు చెబుతున్నారు. విద్యార్థి ఆత్మహత్యకు మరే ఇతర కారణమైనా ఉండవచ్చునని అంటున్నారు. విద్యారి తండ్రి నాగభూషణం ఇదివరకు పట్టణంలోని ఒక ఫైనాన్స్ కార్పొరేషన్‌లో పనిచేసే వాడని ప్రస్తుతం కర్నాటక రాష్ట్రం బళ్లారిలోని ఒక ప్యాక్టరీలో పనిచేస్తూ అక్కడే ఉంటూ వారానికి ఒకరోజు ఉరవకొండకు వచ్చి వెళుతున్నాడని సమాచారం. కొడుకు ఆత్మహత్య విషయం తెలియగానే అతని తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు హుటాహుటిన ఇడుపులపాయకు బయలుదేరారు.

# రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎస్.కె.ఉన్నత పాఠశాల విద్యార్థులు

-అభినందించిన ఇంచార్జ్ హెచ్‌ఎం, పీడీ, పీఈటీ సిబ్బంది

**ఉరవకొండ, నవంబర్ 24 ప్రభాతవార్త :** పట్టణంలోని శ్రీ కరిబసవస్వామి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి సి.నవకిరణ్, 9వ తరగతి విద్యార్థి మహమ్మద్ అండర్-14, 17 విభాగాల్లో రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ఇంచార్జ్ హెచ్‌ఎం కె.రామకుమార్, ఫిజికల్ డైరెక్టర్ వై.క్రిష్ణారెడ్డి, పీఈటీ రాజేష్ తెలిపారు. గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు బుక్కరాయసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగగా ఇరువురూ మంచి ప్రతిభ కనబర్చారని విద్యార్థులను అభినందించారు.

# చేతులెత్తి మొక్కుతున్నాం..రోడ్లు, డ్రైనేజీను నిర్మించండి

-ఎంపీడీఓకు వేడుకున్న చౌడేశ్వరి కాలనీ 4వ, చర్చిలైన్ల ప్రజలు

**ఉరవకొండ, నవంబర్ 24 ప్రభాతవార్త :** మీకు చేతులెత్తి మొక్కుతాం..ఒక్కసారి మా కాలనీలో పర్యటించి మేము పడుతున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా చూసి సిమెంటు రోడ్లు, డ్రైనేజీను ఏర్పాటు చేయాలని పట్టణంలోని చౌడేశ్వరి కాలనీ 4వ, చర్చి లైన్లకు చెందిన ప్రజలు చేతులెత్తి మొక్కి వేడుకున్నారు. కాలనీకు చెందిన రమాదేవి, శేఖర్‌బాబు, పద్మావతి, పార్వతి, చౌడమ్మ, గురుస్వామి, రామాంజినేయులు తదితరులు గురువారం ఉదయం మండల పరిషత్ కార్యాలయం చేరుకొని ఎంపీడీఓ యం.డి.అమృత్‌రాజ్‌ను కలిసి వినతిపత్రం అందించి వాస్తవ పరిస్థితులను వివరించి వేడుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చౌడేశ్వరి కాలనీలోని 4వ, చర్చి లైన్లలో నేటికీ మట్టి రోడ్లే ఉన్నాయన్నారు. సిమెంటు రోడ్లులేక రోడ్లకు ఇరువైపులా డ్రైనేజీలేక మురికినీరు, వర్షపునీరు రోడ్డుపైనే పారుతుంటుందని నడవడానికి, ఇళ్లలోకి వెళ్లడానికి కూడా ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. తీవ్ర అపరిశుభ్రత కారణంగా దోమల వ్యాప్తి అధికంగా ఉంటోందని వాపోయారు. కాలనీలోని రెండు లైన్లలో మట్టి రోడ్ల స్థానంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటు చేయాలని కోరారు. మా గోడు స్థానిక ప్రజాప్రతినిధులు ఎవరికీ పట్టడంలేదని వారుండీ మాకు ఎలాంటి ప్రయోజనం లేదని వాపోయారు.

# నాలుగు లక్షల మందికి అన్నదాన నారాయణ సేవ



ప్రత్యేక అలంకరణలో సత్యసాయి ప్రశాంతి నిలయం

**పుట్టపర్తి, నవంబర్ 24, ప్రభాతవార్త :** సుమారు నాలుగు లక్షల మందికి సత్యసాయి జయంతి ఉత్సవాల సందర్భంగా అన్నదాననారాయణ సేవ నిర్వహించినట్లు ట్రస్ట్ వర్గాలు తెలిపాయి. బాబా 97వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 18వ తేది నుండి 24వ తేది వరకు ప్రశాంతి నిలయంలో నారాయణ సేవ నిర్వహించారు. ప్రతి రోజూ మధ్యాహ్నం, రాత్రివేళల్లో రోజూ 50 వేల మందికిపైగా అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రశాంతి నిలయం వెస్ట్ గేటు వద్ద సుమారు 100 కౌంటర్లు ఏర్పాటు చేసి భక్తాదులకు అన్నదానం చేశారు. అన్నం, పప్పు, సాంబారు, కుర్మా, రసం, కూరగాయల అన్నం, రోటీలు, పొంగలి, తీపి పదార్థం, పెరుగన్నం, పచ్చడి వంటి రుచికరమైన, శుచికరమైన ఆహార పదార్థాలు వేడివేడిగా వండి ప్రతి రోజూ వేలాది మంది భక్తులకు అన్నదాన నారాయణ సేవ చేవారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ చేపట్టిన ఈ మహత్తర కార్యక్రమం భక్తుల వేనోళ్ళలో అద్బుతం అనిపించింది. ఈ సేవా కార్యక్రమంలో పాలు పంచుకొని అహోరాత్రులు కష్టించి విశేష సేవలందించిన మహిళ, పురుష సేవా సభ్యులకు, నిర్వాహకులకు ఆతిథ్యం స్వీకరించిన ప్రతి సాయి భక్తుడూ, అన్నదాత సుఖీభవా...సాయిరాం...సాయిరాం... అంటూ వేడుకున్నారు. నాలుగులక్షల మందికిపైగా అన్నదాన నారాయణ సేవ అన్న విషయం అసాధారణమైందని...! అది భగవాన్ సత్యసాయి బాబా కృపవల్లే సాధ్యమైందని భక్తులు అభివర్ణించారు.

# జయారెడ్డి, పార్వతమ్మ దంపతుల ఆధ్వర్యంలో అయ్యప్పలకు అన్నదానం



అయ్యప్ప భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

**గోరంట్ల, నవంబర్ 24 ప్రభాతవార్త :** పట్టణంలోని పాత గ్రామీణ బ్యాంకు వీధిలో శ్రీరామస్వామి దేవాలయంలో గురువారం జయారెడ్డి, పార్వతమ్మ దంపతుల ఆధ్వర్యంలో అయ్యప్పలకు అన్నదాన కార్య క్రమాన్ని నిర్వహించారు. తొలుత రామస్వామి దేవాలయంలో అమడగూరుకు చెందిన జయారెడ్డి, పార్వతమ్మ, కర్నాటక రాష్ట్రం దేవణహళ్లికి చెందిన శ్రీసాయి హోటల్ నిర్వాహకులు అయ్యప్పస్వామి, రామస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి 200 మంది అప్పయ్యలకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంకె గురుస్వామి, అన్నపూర్ణ ఆదినారాయణస్వామి, తదితర స్వాములు పాల్గొన్నారు.

# వేధింపులకు గురిచేస్తున్న ఎస్‌టిఐపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందచేస్తున్న కార్మికులు

**గుత్తి, నవంబర్ 24 ప్రభాతవార్త :** గుత్తి ఆర్టీసి డిపోలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల పట్ల ఎస్‌టిఐ ఆధికారి వేధింపులకు గురిచేస్తూ కించపరిచే రీతిన వ్యవహరిస్తున్నారని ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఆరోపించారు. గురువారం వారు స్థానిక డిపోలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సదరు అధికారి బాధ్యతలు చేపట్టినప్పటి నుండి ఇప్పటి వరకు కార్మికుల పట్ల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. విధి నిర్వహణలో కార్మికుల పట్ల అసభ్యపదజాలంతో దూషిస్తున్నారని విమర్శించారు. సదరు అధికారిపై చర్యలు తీసుకోవాలని వారు రీజనల్ మేనేజర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు టికె రాముడు, జెపి రాముడు, వాసులు, దామోదర్, గంగేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

# కొడుకును చంపిన తండ్రికి జీవితఖైదు

**గుత్తి, నవంబర్ 24 ప్రభాతవార్త :**

కన్నకొడుకునే నిప్పంటించి హత్య చేసిన తండ్రికి గురువారం స్థానిక 6వ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు అదనపు జిల్లా జడ్జి కపర్ది జీవితఖైదు విధిస్తూ తీర్పు వెల్లడించారు. వివరాలు ఇలా వున్నాయి. నియోజకవర్గంలోని పామిడి పట్టణానికి చెందిన షేక్‌ఖాజామైనుద్దిన్ 2021 ఏప్రిల్ నెలలో ఇంటి మిద్దెపై నిద్రిస్తున్న పెద్దకుమారుడు జావిద్‌పై కిరోసిన్ పోసి నిప్పంటించి హత్య చేశాడు. ఈ సంఘటనపై విచారించిన కోర్టు తండ్రిని దోషిగా నిర్ణయించి జైలు శిక్ష విధించారు. జైలు శిక్షతో పాటు 500 రూపాయల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ తరుపున పిపి సుదర్శన్‌రెడ్డి కేసు వాదించారు.

# మాజీ ఎంపి నిమ్మల కిష్టప్పను మర్యాదపూర్వకంగా కలిసిన సవితమ్మ



నిమ్మల కిష్టప్పతో చర్చిస్తున్న దృశ్యం

**గోరంట్ల, నవంబర్ 24 ప్రభాతవార్త :** పట్టణంలోని మాజీ హిందూపురం ఎంపి, తేదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు నిమ్మల కిష్టప్పను ఆయన నివాసంలో తేదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో గుట్టురు మాజీ సర్పంచు సూర్యనారాయణ, అడదాకులపల్లి మాజీ సర్పంచు ప్రసాద్, కక్కల రఘునాథరెడ్డి, శ్రీధర్, త్రివేం ద్రనాయుడు, మావటూరు గోపాల్, బాబుల్‌రెడ్డి, టవాల్ నరసింహులు, శ్రీనివాసులు తదితర నాయకులు పాల్గొన్నారు.

# విజయసంకల్పయాత్రను జయప్రదం చేయండి

**విడపనకల్లు, నవంబర్ 24 ప్రభాతవార్త :**

మండలంలోని చీకలగురికి గ్రామ పంచాయతీ నుండి శుక్రవారం విజయసంకల్పయాత్రను ఉరవకొండ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి తనయుడు వై.ప్రణయ్‌రెడ్డి యాత్రను ప్రారంభిస్తున్నట్లు విలేకరుల సమావేశంలో మండల ఇన్‌చార్జ్, అధ్యక్షులు కరణం పుష్పావతి భీంరెడ్డి, జెడ్‌పిటిసి హనుమంతు, కన్వీనర్ బసన్న, భరత్‌రెడ్డి, మాజీ జెడ్‌పిటిసి తిప్పయ్య తెలిపారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గం స్థాయిలో మొదటిసారి చీకలగురికి గ్రామం నుండి ప్రారంభిస్తున్న సందర్బంగా నియోజవర్గం జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, సర్పంచులు, ఎంపిటిసిలు, సొసైటీ చైర్మన్లు, కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్య క్రమంలో వెంకటేష్, వన్నరెడ్డి, రాజశేఖర్, రఘురాం, కొత్తపల్లి మహేష్, కొత్తపలి శీన, కేశన్న, తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ బీమా క్రింద రూ.10వేల తక్షణ సహాయం అందజేత

**కొత్తచెరువు, నవంబర్ 24, ప్రభాతవార్త :**

మండల పరిధిలోని చెన్నమరాజుపల్లిల్లో గ్రామానికి చెందిన తలారి నటరాజ్(40) ఈ నెల 19వ తేదిన కొడికొండ చెక్‌పోస్టు సమీపంలో జరిగిన ద్విచక్రవాహనం యాక్సిడెంట్ నందు తీవ్ర గాయాలు పాలై ఈ నెల 22వ తేదిన కర్నూలు ఆసుపత్రిలో చిక్సిత పొందుతూ మరణించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు వైఎస్ఆర్ బీమా ద్వారా రూ.5 లక్షల రూపాయలను అందజేయడం జరుగుతుందని, బండ్లపల్లి పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఈ క్రమంలో మృతుడి కుటుంబానికి తక్షణ సహాయం క్రింద రూ.10 వేల ఆర్థిక సహాయంను గురువారం ఆయన అందించారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఓ ఓబులేసు, వైఎస్ఆర్‌సిపి నాయకులు నారాయణ, రామచంద్రారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ హేమాద్రి తదితరులు పాల్గొన్నారు.

# వడ్డెర సంక్షేమ భవన్‌కు స్థలం కేటాయించాలని కలెక్టర్‌కు వినతి

**పుట్టపర్తిటౌన్, నవంబర్ 24, ప్రభాతవార్త**

జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో వడ్డెర సంక్షేమ భవన్‌కు స్థలం కేటాయించాలని వడ్డెర సంక్షేమ సంఘంనాయకులు కలెక్టర్ బసంత్‌కుమార్‌ను కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్‌ను కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్బంగా రాష్ట్ర వడ్డెర కార్పోరేషన్ డైరెక్టర్ ఉమారాజు మాట్లాడుతూ,జిల్లాలో దాదాపు 40 వేల మంది వడ్డెరలు ఉన్నారని, వారు శుభకార్యాలు సమావేశాలు జరుపుకొనుటకు జిల్లా కేంద్రంలో ఒక ఎకరా స్థలం కేటాయిస్తే భవననిర్మించుకుంటామని కలెక్టర్‌ను కోరామన్నారు. ఇందుకు స్థానిక శాసన సభ్యులు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి కూడా సానుకూలంగా స్పందించి కలెక్టర్‌కు సిఫార్సు చేశారన్నారు. కలెక్టర్ కూడా సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వడ్డెర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు జరిపిటి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు మారెప్ప, ప్రధాన కార్యదర్శి గోగుల చక్రపాణి, ఇందుకూరు పల్లి ఉత్తన్న తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న వడ్డెర సంఘం నాయకులు

06ATP27_06ATP27.qxd 24-11-2022 PM 10:11 Page 1



## సత్యసాయి జన్మదిన వేడుకల సందర్భంగా రోగులకు అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న సేవా సమితి సభ్యులు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శశిరేఖ

**మడకశిర టౌన్, నవంబర్ 24 ప్రభాతవార్త :** సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలోపట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలోబాబా జన్మదిన వేడుకలు రెండు రోజులపాటు కన్యకా పరమేశ్వరి దేవాలయంలో నిర్వహించనున్నారు. బాల వికాస్ పిల్లలచే సంస్కృతిక, కార్యక్రమాలు నృత్య కార్యక్రమాలు కోలాటం పద్య సూక్తులు తదితర వాటిని నిర్వహించడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శశిరేఖ, డాక్టర్ పద్మజ, సిబ్బందితోపాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడమే కాకుండా శల్య చికిత్సలయంలో కూడా బాధితులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను కూడా అందజేశారు. బాబా కీర్తనలు ఎంతగానో భక్తులను ఆకట్టుకున్నాయి. ప్రముఖులు ముఖ్య అతిథులుగా కూడా విచ్చేయడం జరిగింది. మాజీ మంత్రి రఘువీరారెడ్డి విశ్రాంతి డిఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిఏ గోవిందరాజులు, ఏ.గోపాలకృష్ణ, సేవా సమితి సభ్యులు మహిళలు, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రగతి బ్యాంకు ఆకర్షణీయమైన వడ్డీ

**అగళి, నవంబర్ 24 ప్రభాతవార్త :** ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో డిపాజిట్ దారులకు ఆకర్షణీయమైన మంచి వడ్డీని తమ శాఖ ఇస్తోందని బ్యాంకు మేనేజర్ వినోద్‌కుమార్ అన్నారు. మహిళా సీనియర్ సిటిజన్లకు 7.25శాతం త్రైమాసికచక్రవడ్డీ ఇస్తోందని, ఇది మహిళలకు ప్రత్యేకమన్నారు. 400 రోజులకు ఇది వర్తిస్తుందన్నారు. అదే సీనియర్ సిటిజన్ అయిన పురుషులకు 7.20 శాతం త్రైమాసిక చక్రవడ్డీ వర్తిస్తుందన్నారు. సాధారణ మహిలా డిపాజిటర్లకు 6.75 శాతం త్రైమాసిక చక్రవడ్డీ, అదే సాధారణ డిపాజిటర్లకు 6.70 శాతం త్రైమాసిక వడ్డీ వస్తుందన్నారు. ప్రగతి నవ్య, క్యాష్ హ్యాండ్లింగ్ చార్జీలు మినహాయింపు, ఇది వ్యాపారస్తుల కోసం తమ బ్యాంకు కల్పిస్తున్న ఏకైక సేవ. 10 లక్షల వరకు ఇంటర్నెట్ బ్యాంకింగ్ లిమిటెడ్ ఉచిత బడ్జెట్ కార్డు సదుపాయం, ప్రగతి భవ్య, పర్సనలైజ్డ్ చెక్‌బుక్ సౌకర్యం ఉంటుందన్నారు. ఎటు తిరిగి సీనియర్ మహిళలకు 0.50శాతం అధికంగావడ్డీ వర్తిస్తుందన్నారు. సీనియర్ సిటిజన్లకు టర్మ్‌డిపాజిట్లపై ఒక ఆర్థిక సంవత్సరానికి వచ్చే వడ్డీతో 50వేల వరకు ఎటువంటి పన్ను విధింపులేదు. అన్నిరకాలైన డిపాజిట్లపై నామినేషన్ సౌకర్యం కలదు. ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంకు కల్పించేవెసులుబాటును ఖాతాదారులు, డిపాజిట్ దారులు సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ వినోద్‌కుమార్ కోరారు.

## మండలంలో సర్వసభ్య సమావేశం

### - అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

**గుడిబండ, నవంబర్ 24 ప్రభాతవార్త :** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం రసాబాసగా జరిగింది. మండల సమస్యలపై అధికారులను ఎంపిటిసిలు, సర్పంచులు నిలదీశారు. ఈ సందర్భంగా ఎంపిటిసిలు, సర్పంచులు సమావేశాన్ని ఉద్దేశించి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజా ప్రతినిధులకు సహకరించట్లేదని అలాగే సమస్యలను చెబితే వినే ఓపిక కూడా లేదంటూ సర్పంచులు తాళ్లకెర రంగస్వామి, సిసిగిరి డిఎల్ యంజారేగౌడ్‌లు విద్యుత్ ఏఈ, ఎస్‌ఎస్‌ఏ ఏఈఓ, ఉపాధి హామీ సిబ్బందిపై తీవ్రంగా మండిపడ్డారు. ప్రతి సర్వసభ్య సమావేశంలో అధికారులు చెప్పడం మేము వినడం జరుగుతోందని సమస్యలను పరిష్కరించే ఉద్దేశం అధికారులకు లేదంటూ సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో జడ్పిటిసి భూతరాజు మాట్లాడుతూ.. అధికారులందరూ ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాధమ్మ, జడ్పిటిసి భూతరాజు, ఎంపిడిఓ రామారావు, తహశీల్దారు మహబూబ్‌పీరా, అడ్మినిస్ట్రేషన్ అధికారి నారాయణప్ప, ఈఓఆర్డి నాగరాజునాయక్, సింగిల్ విండో అధ్యక్షులు చంద్రశేఖర్, వైస్ ఎంపిపిలు రవికుమార్, రత్నమ్మ, సర్పంచులు జగదాంబ క్రిష్ణప్ప, శివరుద్రమ్మ, ఎంపిటిసిలు రామచంద్ర, సుశీల, సురేష్ తదితర మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## కలెక్టర్ గారు..బ్రిడ్జీ కూలిపోకముందే చర్యలు తీసుకోండి..!

### -శిథిలమైన హెచ్‌ఎల్‌సీ బ్రిడ్జీ రాయంపల్లి రైతుల నిరసన



శిథిలమైన బ్రిడ్జీపై నిరసన తెలుపుతున్న రాయంపల్లి గ్రామ రైతులు

**ఉరవకొండ, నవంబర్ 24 ప్రభాతవార్త :** జిల్లా కలెక్టర్ స్పందించి రాయంపల్లి గ్రామం వద్ద శిథిలమైపోయిన హెచ్‌ఎల్‌సీ బ్రిడ్జీ కూలిపోకముందే తగిన చర్యలు చేపట్టాలని ఆ గ్రామానికి చెందిన రైతులు కోరారు. గురువారం ఆ గ్రామానికి చెందిన ఎర్రిస్వామిరెడ్డి, సురేంద్రరెడ్డి, సత్యనారాయణరెడ్డి, లాలుస్వామి, సుధాకర్‌రెడ్డి, వెంకటరెడ్డి, మృత్యుంజయ తదితరులు శిథిలమైన బ్రిడ్జీపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్రికల్లో కథనాలు వచ్చినపుడు హెచ్‌ఎల్‌సీ అధికారులు బ్రిడ్జీను పరిశీలించి వెళ్లడంతప్ప సమస్య పరిష్కారానికి చొరవ చూపడంలేదని వాపోయారు. పాత బ్రిడ్జీ శిథిలంకాగా కొత్త బ్రిడ్జీ వినియోగించుకోవడానికి ఏర్పాటు చేయడంలేదని మండిపడ్డారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపితే సమస్య పరిష్కారం అవుతుందన్నారు.

## తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

### -రాష్ట్రం సుభీక్షంగా ఉండాలని కోరుకున్నట్లు వెల్లడి

**ఉరవకొండ, నవంబర్ 24 ప్రభాతవార్త :** ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి గురువారం తిరుమలలో వెంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున వీఐపీ బ్రేక్ దర్శనం సమయంలో ఆయన తన మేనల్లుడు డాక్టర్ రోహిత్‌తో కలిసి శ్రీవారిని దర్శించుకోగా ఆలయ అధికారులు ఆయనకు శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి సారథ్యంలో సుభీక్షమై ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని మొక్కుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట వైసీపీ నాయకుడు సి.పి.వీరన్న ఉన్నారు.



ఆలయంవద్ద మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

## సబ్ స్టేషన్‌కు స్థలం గుర్తింపు

**అగళి, నవంబర్ 24 ప్రభాతవార్త :** మండల పరిధిలోని రామనపల్లిలో విద్యుత్ సబ్ స్టేషన్ 2.50 కోట్లతో మంజూరైంది. సదరు సబ్ స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వం స్థలం ఇవ్వాల్సి ఉంది. అందుకు తహశీల్దారు జీలాని, డిప్యూటీ తహశీల్దారు సుబ్బారావు, ఆర్‌ఐ, విఆర్‌ఓలు, సర్వేయర్లతో కలిసి ప్రభుత్వ స్థలాన్ని గుర్తించారు. దీని నిర్మాణానికి 2.50 కోట్లు మంజూరు అయ్యాయని, దాదాపు 80 నుంచి 90 సెంట్ల భూమిని సబ్ స్టేషన్ నిర్మాణానికి ఇవ్వనున్నట్లు తహశీల్దారు జీలాని తెలిపారు. ఇప్పటికే భూమిని గుర్తించి సదరు స్థలంలో సబ్ స్టేషన్ నిర్మాణానికి సర్వేచేసి హద్దులను నిర్ణయించి స్కెచ్‌ను కూడా తయారు చేసినట్లు తెలిపారు.

## తప్పిన విద్యుత్ పెను ప్రమాదం

### - ఊపిరి పీల్చుకున్న ఆర్టీసీ ప్రయాణికులు



ఆర్టీసి బస్సుపై పడ్డ విద్యుత్ స్తంభం

**రొద్దం, నవంబర్ 24 ప్రభాతవార్త :** గురువారం రొద్దం మండల కేంద్రం మెయిన్ రోడ్డు, శివశక్తి మెడికల్ స్టోర్ ప్రక్కన విద్యుత్ స్తంభం మడకశిర- పాగవగడకు వెళ్లే ఆర్టీసీ బస్సుపై విరిగి పడింది.. అయితే విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఫీజు కారియర్‌ను ఆఫ్ కావడంతో కరెంటు సరఫరా ఆగిపోయింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న 30 మంది ప్రయాణికులు విద్యుత్ ప్రమాదానికి గురికాకుండా పెను ప్రమాదం నుంచి తప్పించుకునా న్నరు. వివరాల్లోకి వెళ్లితే రొద్దం మండల కేంద్రంలోని మెయిర్ రోడ్డుకు ఇరువైపులా ద్విచక్రవాహ నాలు ఉంచడంతో మడకశిర- పావగడకు పావగడ నుంచి మడకశిర వస్తున్న ఆర్టీసీ బస్సులు ఎదురెదురుగా రావడంతో శివశక్తి మెడికల్ స్టోర్ ప్రక్కన ఉన్న విద్యుత్ స్థంభాన్ని ఢీకొట్టడంతో విద్యుత్ స్తంభం విరిగి ఆర్టీసీ బస్సుపై పడింది.. అయితే ప్రమాదవశాత్తు సబ్ స్టేషన్‌లో ఫీజులు ఎగిరిపో వడంతోనే కరెంటు సరఫరా నిలిచిపోవడంతోనే ప్రయాణికులు ప్రమాదానికి గురికాకుండా సురక్షితులయ్యారు. వెంటనే విద్యుత్‌శాఖ అధికారులకు స్థానిక ప్రజలు, ప్రయాణికులు తెలియజేయగానే విద్యుత్‌శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు సంఘటనా స్థలానికి చేరుకుని నూతనంగా విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటుచేశారు. రోడ్డుకుఇరువైపులా ద్విచక్రవాహనాలుఉంచడంతోనే ఇలాంటి ప్రమాదాలుజరుగుతున్నాయని స్థానిక ప్రజలు ప్రయాణికులు పేర్కొన్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా వాహనాలు ఉంచకుండాచర్యలుతీసుకోవాలని స్థానికప్రజలు,ప్రయాణికులు కోరుతున్నారు.

## అయ్యప్ప భక్తులకు నిత్య అన్నదానం



అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

**పెనుకొండ, నవంబర్ 24 ప్రభాతవార్త :** శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలోని ఊరి వాకిలి ఆంజినేయస్వామి దేవాలయం వద్ద గల అయ్యప్ప స్వామి దేవాలయంలో గురువారం నుంచి అయ్యప్ప స్వామి భక్తులకు నిత్య బిక్ష భోజనం (అన్నదాన కార్యక్రమం) కార్యక్రమం ప్రారంభమైంది. ఈ అన్నదాన కార్యక్రమం శుచి, శుభ్రతతో భక్తి శ్రద్ధలతో అయ్యప్పలే తగు సమయానికి సిద్ధం చేసి నిర్వహిస్తారు. ఈ బిక్ష కార్యక్రమం అయ్యప్ప భక్తులకు ప్రతిరోజుమధ్యాహ్నం 12:30 గంటల నుంచి 2 గంటల వరకు ఉంటుంది. గురువారం నుంచి జనవరి 4, 2023 వరకు ప్రతిరోజు అన్నదాన కార్యక్రమం ఉంటుంది. ఈ అన్నదాన కార్యక్రమాన్ని స్థానిక, చుట్టుపక్కల మండలాల్లో ఉన్న ప్రతి అయ్యప్ప భక్తుడు సద్వినియోగం చేసుకోవడమే కాకుండా పెనుకొండ జాతీయ రహదారి మీదుగా శబరిమలైకు కాలినడకన వెళ్లేప్రతి అయ్యప్ప భక్తునికి విషయం తెలియపరచి అయ్యప్ప పాదచార భక్తుల ఆకలి తీర్చేందుకు సహాయ సహకారాలు అందించాలని ఈ అన్నదాన కార్యక్రమాన్ని గత 12 సంవత్సరాలుగా ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్న పెనుకొండ లాయర్ పి.సుదర్శనరెడ్డి తెలియజేశారు. నిత్యం జరిగే అన్నదాన కార్యక్రమానికి వేలాదిగా అయ్యప్ప భక్తులు అశేషంగా తరలి వచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేసి తమ వంతు దీవెనలు అందించాలనికోరారు.

## ఇన్‌చార్జ్ ఎంపిపిగా కరణం పుష్పవతికి బాధ్యతలు



ఇన్‌చార్జ్ ఎంపిపిని గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

**విడపనకల్లు, నవంబర్ 24 ప్రభాతవార్త :** మండలం ప్రజా పరిషత్ ఇన్‌చార్జ్ అధ్యక్షులుగా (ఎంపిపి) కరణం పుష్పవతి భీంరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల మాజీ ఎంపిపిగా పనిచేసిన బోయ నాగలక్ష్మీ సంవత్సర కాలం పాటు పనిచేసి ఆమె తన వ్యక్తిగత కారణాల వల్ల పదవికి రాజీనామా చేశారు. దీంతో ఉపాధ్యక్షులుగా కొనసాగుతున్న కరణం పుష్పవతిభీంరెడ్డి ఇన్‌చార్జ్ ఎంపిపిగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. కార్మిక శాఖ మంత్రి సోదరుడు గుమ్మనూరు నారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన ఇన్‌చార్జ్ ఎంపిపిగా బాధ్యతలు స్వీకరించిన కరణం పుష్పవతిని భీంరెడ్డిని పలువురు పూలమాలలు వేసి శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి హనుమంతు, వైసిపి మండల కన్వీనర్ బసన్న, కరణం భీంరెడ్డి, భరత్‌రెడ్డి, సుంకన్న, ఎంపిటిసిలు, సర్పంచులు, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు పంటనష్టపరిహారం ఇవ్వాలి



డిటికి వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

**గుత్తి, నవంబర్ 24 ప్రభాతవార్త :** అకాల వర్షాల కారణంగా పంటలు సాగుచేసి ఆర్థికంగా దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం పంటనష్టపరిహారం చెల్లించాలని సిపిఐ రైతుసంఘం కార్యదర్శి మక్బుల్, వీరభద్రస్వామి డిమాండ్ చేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారుమాట్లాడుతూ వేరుశనగపంటకు ఎకరా కు 25వేలు, పత్తిపంటకు ఎకరాకు 50 వేల రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. నియోజకవర్గంలోని చెరువులకు హంద్రీనీవా ద్వారా వచ్చే ఏడాది ఏప్రిల్ వరకు నీరు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటి తహశీల్దార్ హాజివలికి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి రామదాసు, నాయకులు రామకృష్ణ, డ్యానియెల్, నరసింహయ్య, మహబూబ్‌బీ, మహమ్మద్, పాల్గొన్నారు.

## అంగన్‌వాడి, స్టోర్ల తనిఖీ



అంగన్‌వడి కేంద్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

**గుత్తి, నవంబర్ 24 ప్రభాతవార్త :** గుత్తి మున్సిపల్ పరిధిలోని గుత్తి ఆర్‌ఎస్‌లో గురువారం జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి శోభారాణి అంగన్‌వాడి కేంద్రాలు, స్టోర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె సూరసింగనపల్లి కాలనీలో వున్న అంగన్‌వాడి కేంద్రాన్ని పరిశీలించి ఆహారం నాణ్యతను, వారికి అందుతున్న మెనూను పరిశీలించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరశీలించి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. రేషన్ దుకాణం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె కార్డుదారులకు బియ్యం అందుతున్న వైనాన్ని పరిశీలించారు. బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేయాలన్నారు. నూతనంగా ఎండియు వాహనాలకు జిపిఆర్‌ఎస్ పరికరాలు అమరుస్తున్న నేపథ్యంలో వాటిని డిఎస్ఒ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహశీల్దార్ హాజివలి, బాలు, తదితరులు పాల్గొన్నారు.

## ముసాయిదా ఓటరుజాబితా విడుదల

**గుత్తి, నవంబర్ 24 ప్రభాతవార్త :** పశ్చిమరాయలసీమ పట్టభద్రుల ఓటరు ముసాయిదా జాబితాను గురువారం అధికారులు విడుదల చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 3051 మంది ఓటర్లు వున్నారు. వారిలో పురుషులు 2021, స్త్రీలు 1030 మంది ఓటు హక్కు వున్న వారిగా జాబితాలో పేర్కొన్నారు. ఎన్నికల నిమిత్తం 3 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అభ్యంతరాలు వుంటే తెలపాలని మరోదఫా ఓటరుగా నమోదు చేసుకోవడానికి అవకాశం వున్నందున సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో రూత రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌కు ఘనసన్మానం



సన్మానిస్తున్న దృశ్యం

**గోరంట్ల, నవంబర్ 24 ప్రభాతవార్త :** గోరంట్ల మేజర్ పంచాయతీ పరిధిలోని మార్కెట్ రోడ్డులో వున్న జిల్లా పరిషత్ ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న ఫిరోజ్‌అహ్మద్ రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రూత రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన సందర్భంగా పేరెంట్స్‌తో పాటు మైనార్టీ నాయకులు కమిటీ సభ్యులు ఆయనను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్‌అజ్మతుల్లాసాహేబ్, రహంతుల్లా, మెకానిక్ చాంద్‌బాషా, ఫజుల్లాకరీమ్, నబీరసూల్, తదితరులు పాల్గొన్నారు.

## ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షునిపై దాడి అమానుషం



నిరసన తెలుపుతున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

**గుంతకల్లు టౌన్, నవంబర్ 24 ప్రభాతవార్త :** ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపాగు సురేష్‌పై దాడి చేయడం అమానుషమని ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నాయకులు నరసింహులుమాదిగ, భీమలింగమాదిగ, ఆనంద్‌మాదిగలు అన్నారు. గురువారం స్థానిక అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత యువతి అత్యాచారం కేసులో సాంబయ్యచౌదరిని అరెస్ట్ చేయాలని గుంటూరు కలెక్టరేట్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపున్న వారిపై నగరపాళ్యెం సిఐ దురుసుగా ప్రవర్తించారన్నారు. ఉన్నత స్థాయి పోలీసు అధికారుల సమక్షంలో బూటుకాలుతో తన్నుతూ అసభ్యకరంగా మాట్లాడరని విమర్శించారు. అధికారులు స్పందించి సిఐపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, రాంబాబు, వీరేష్, వీరాంజినేయులు, తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయంలో సమీక్ష సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ శ్రీనివాసరావు

**అగళి, నవంబర్ 24 ప్రభాతవార్త :** మండల పరిధిలోని హెచ్‌డి హళ్లి సచివాలయంలో సర్పంచు రామకృష్ణప్ప అధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపిడిఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. అన్ని శాఖలకు సంబంధించి ఈ రోజు సమీక్షలు నిర్వహించిన అనంతరం సచివాలయ ఉద్యోగులు రిపోర్టులు తీసుకొచ్చారని తెలిపారు. గత వారం రోజులుగా అంగవైకల్యం పెన్షన్‌పై ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించారని, పెన్షన్‌పొందుతున్న వారు ఉన్నారా లేదా.. భోగస్ ఏవైనా ఉన్నాయా.. సదరం క్యాంపు సమయంలో ఇచ్చిన ఐడి నెంబర్లకు ఇక్కడున్న ఐడిలకు పోలిక అవుతుందా లేదా అన్న విషయాలన్నీ పరిశీలించి పంచాయితీ పరిధిలోని పెన్షన్లను పరిశీలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి పద్మ, సచివాలయ ఉద్యోగులు సాయి, కాటప్ప, లావణ్య, రమ్య తదితరులు ఉన్నారు.

## రోజుకో గ్రామంలో బయటపడుతున్న కుట్టుమిషన్ల కుంభకోణం..!

### - శిక్షణ పేరుతో గ్రామాలకు వెళ్లడం, డబ్బులు కట్టించుకొని ఉడాయించడం - బాధితులు పిర్యాదులు చేస్తే డబ్బులిచ్చి సరిపెట్టుకొంటున్న స్వచ్ఛంధ సంస్థలు - పాత్రదారులు, సూత్రదారులపై కొనసాగని చర్యలతో రెచ్చిపోతున్న వైనం



**ఉరవకొండ, నవంబర్ 24 ప్రభాతవార్త :** ఉరవకొండ ప్రాంతంలో రోజుకో గ్రామంలో కుట్టుమిషన్ల కుంభకోణం బయటపడుతోంది. రెండు మూడు నెలలు శిక్షణ ఇచ్చి ఆ తరువాత తక్కువ ధరకే కుట్టుమిషన్లను అందిస్తామన్న స్వచ్ఛంధ సంస్థల నిర్వాహకులు, మధ్యవర్తుల మాయ మాటలు నమ్మి వందలు, వేల సంఖ్యలో మహిళలు డబ్బులు కట్టి మోసపోతున్నారు. మొన్న ఉరవకొండ పట్టణంలో 100 మందికిపైగా, నిన్న షేక్షానుపల్లిలో 102 మంది, నేడు పెద్దముష్టూరులో 69 మంది మహిళలు డబ్బులు కట్టి మోసపోయారు. అయితే ఉరవకొండ మహిళలు పోలీసులను ఆశ్రయించి సదరు స్వచ్ఛంధ సంస్థ, దాన్ని అడ్డపెట్టుకొని డబ్బులు వసూళు చేసిన వారిపై పిర్యాదు చేయడంలో వెంటనే అప్రమత్తమైన ఈ కుంభకోణంలో సూత్రదారులు, పాత్రదారులు పోలీసులవద్ద సమయం తీసుకొని మోసపోయిన మహిళలకు వారి నుండి వసూళు చేసిన 3000 నుండి 6,700 రూపాయల చొప్పున డబ్బులు తిరిగి చెల్లించి చేతులు దులుపుకున్నారు. ఈక్రమంలో షేక్షానుపల్లి గ్రామంలో మరొక కుంభకోణం బయటకు రాగా అక్కడ 102 మంది బాధిత మహిళలు ఉన్నట్లు సమాచారం. అక్కడ ఒక్కొక్కరు 1,300 రూపాయల చొప్పున స్వచ్ఛంధ సంస్థకు స్థానికంగా మధ్యవర్తులుగా వ్యవహరించిన కొందరి ప్రోద్భలంతో డబ్బులు కట్టి మోసపోయినట్లు సమాచారం. ఈ విషయమై కొందరు పోలీసులకు పిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం బయటపడింది. అయితే వెంటనే రంగంలోకి దిగిన మధ్యవర్తులు వ్యవహారం చేయిదాటిపోకుండా చక్రం తిప్పినట్లు సమాచారం. తాజాగా పెద్దముష్టూరు గ్రామంలోనూ 69 మంది మహిళలు కుట్టుమిషన్లకు 1,300 రూపాయల చొప్పున డబ్బు కట్టినట్లు తెలిసింది. కుట్టుమిషన్లు ఎప్పుడిస్తారని శిక్షణ ఇచ్చి డబ్బులు కట్టించుకున్న మహిళలను అడిగితే ఆమె ముఖం చాటేయడంతో బాధితులు లబోదిబోమంటున్నట్లు తెలిసింది. ఒకటి రెండు రోజుల్లో బాధిత మహిళలు పోలీసులకు పిర్యాదు చేయనున్నట్లు సమాచారం. స్వచ్ఛంధ సంస్థల పేరుతో కొనసాగుతున్న ఈ భారీ కుంభకోణం మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలోనూ జరిగినట్లు తెలుస్తుండగా ఈ విషయమై పత్రికల్లో వస్తున్న కథనాలతో ఒకరిని చూసి మరొకరు అన్న చందంగా బాధిత మహిళలు బయటకొస్తున్నారు. పోలీసులు పంచాయతీలుచేసి బాధితులకు డబ్బులు కట్టించి చేతులు దులుపుకోకుండా ఈ భారీ కుంభకోణంలో పాత్రదారులు, సూత్రదారులను గుర్తించి వారిపై కఠిన చర్యలను తీసుకోకపోతే తక్కువ డబ్బుకు కుట్టుమిషన్లు వస్తాయన్న ఆశతో మరెందరో మహిళలు మోసపోతారని స్పష్టమౌతోంది.

## పీఏబీఆర్ కుడి కాలువకు నీటి విడుదల నిలిపివేత

### -డ్యాంలో 4.64 టీఎంసీల నీరు నిల్వ



పీఏబీఆర్ కుడి కాలువకు నీటి విడుదలను నిలిపివేసిన దృశ్యం

**ఉరవకొండ, నవంబర్ 24 ప్రభాతవార్త :** పెన్నహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) కుడి కాలువకు నీటి విడుదలను నిలిపివేసినట్లు డ్యాం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.శ్రీనివాసులు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.సి.గుర్రయ్య, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు బి.లక్ష్మిదేవి, హెచ్.గంగమ్మ, కె.ఫాతీమ గురువారం తెలిపారు. ఎగువనున్న పేరూరు డ్యాం నుండి 100 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందన్నారు. పీఏబీఆర్‌లో విద్యుత్ ఉత్పత్తి అవుట్‌ఫ్లోను నిలిపివేయడం జరిగిందని తాగునీటి అవసరాలకు 55 క్యూసెక్కులు వినియోగించడం జరుగుతోందని డ్యాంలో ప్రస్తుతం 4.64 టీఎంసీ నీరు నిలువ ఉందని వారు వివరించారు.

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతా..!



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయుల అభ్యర్థి మన్మోహన్‌రెడ్డి

**మడకశిర టౌన్, నవంబర్ 24 ప్రభాతవార్త :** ఉపాధ్యాయ సమస్యలపరిష్కారం కోసం పోరాడుతానని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్ధిగా పోటీ చేస్తున్న బండ్లపల్లి మదన్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం స్థానిక విశ్రాంతి భవనంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. స్వాతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేయాలని ఉపాధ్యాయుల ప్రోత్సాహం వల్ల పోటీ చేశానని పేర్కొన్నారు. తాను విద్యా సంస్థలు రావడానికి ఎంతగానో కృషి చేశానని, ముఖ్యంగా ఉపాధ్యాయులు పాత పెన్షన్ విధానంకోసం ఈఅంశంపై తాను పోరాడుతానన్నారు. ఆధోనిలో ఇటీవల రాహుల్ గాంధీనికలిసి పాతపెన్షన్ విధ్యానంపై వినతిపత్రం ఇవ్వడం జరిగిందని, ఇది రెండు రాష్ట్రాల్లో అమల్లో ఉందన్నారు. మిగిలిన రాష్ట్రాల్లో సైతం అమలు చేస్తే బాగుంటుందని రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారన్నారు. మా రాడ్స్ స్వచ్ఛంద సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు సైతం చేపట్టామని ఆయనపేర్కొన్నారు. ఉపాధ్యాయులు ఓటరుగా నమోదు చేసుకుని ప్రతిఒక్కరు తమ ఓటుహక్కును వినియోగంచుకుని నన్ను గెలిపించాలని ఆయన ఉపాధ్యాయులను కోరారు. ఈ సందర్భంగా రాడ్స్ స్వచ్ఛంద సంస్థ అడ్వైజర్ తలమర్ల సంజీవరెడ్డి, ప్రొ.వసంత కవిత పాల్గొన్నారు.

## భూమిలేని ప్రతి నిరుపేద రైతులకు వ్యవసాయ భూములు కేటాయిస్తాం

### – ఆర్డిఓ తిప్పేనాయక్



స్పందన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డిఓ తిప్పేనాయక్



కార్యక్రమానికి హాజరైన తహశీల్దారులు

**ధర్మవరం, నవంబర్ 24 ప్రభాతవార్త :** డివిజన్ పరిధిలోని ధర్మవరం, బత్తలపల్లి, ముదిగుబ్బ, తాడిమర్రి, రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాలలో భూమి లేని ప్రతి నిరుపేద రైతులకు వ్యవసాయ భూములను అతిత్వరలో ప్రభుత్వఆదేశాల మేరకు కేటాయించడం జరుగుతుందని ఆర్డిఓ తిప్పేనాయక్ పేర్కొన్నారు. ఈసందర్భంగా పట్టణంలోని ఆర్డిఓ సమావేశ భవనంలో ఏడు మండలాల తహశీల్దారులకు, ఆర్ఐ, విఆర్‌ఓలకు అత్యవసర సమావేశాన్ని గురువారంనిర్వహించారు. అనంతరం గతంలో సూచించిన మేరకు ఇంత వరకు మండలాలలో ప్రభుత్వ భూముల విస్తీర్ణం ఎంత..? ఇంత వరకు భూమలేని నిరుపేద రైతుల గుర్తించిన రైతుల వివరాలు..? ఆ గుర్తించిన విస్తీర్ణము, పేద రైతుల వివరాలు, అర్హులుగా ఉన్నాయా..? లేదా అన్న వారిపై నేరుగా తహశీల్దార్లతో వారు మాట్లాడారు. ఈ నెల 27వ తేదిలోపల తిరిగి ఇంకను గుర్తించవలసిన రైతులెంపిక ఉన్న ఎడల చిట్ట చివరిగా పేర్లను ఎంపిక చేసిన భూముల విస్తీర్ణ వివరాలను అందజేయాలని తెలిపారు. ఇప్పటి వరకు ఏడు మండలాలల్లో 2,167మంది భూమిలేని రైతులను గుర్తించామని, వారందరికీ డివిజన్ పరిధజలో 4,634.25 ఎకరాలలో భూములను కేటాయించడం జరుగుతుందన్నారు. మరోసారి తహశీల్దారు విచారణ చేపట్టి ఇంకను అర్హులైన రైతులు ఉన్నారా.. అన్న వాటిని విచారణ జరిపి పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కతిజిన్ కుప్రా, ఉప తహశీల్దారు లక్ష్మిదేవి, ఏడు మండలాల తహశీల్దార్లు ఈశ్వరయ్య, యుగేశ్వరిదేవి, నారాయణస్వామి, సుబ్బలక్ష్మి, నాగరాజు, నాగేంద్ర, ప్రసాద్, ఆర్ఐలు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

## కెంపేగౌడ 80వ జయంతిని విజయవంతం చేయండి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**అమరాపురం నవంబర్ 24 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని సాయి విద్యానికేతన్ పాఠశాల ఆవరణం నందు ఈనెల 27వ తేదీ ఆదివారం కుంచిటిగ వక్కలిగ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే కెంకె గౌడ జయంతి ఉత్సోవాలను జయప్రదం చేయాలని మండల వ్యాప్తంగా ప్రతి గ్రామాల్లో కుంచిటి వక్కలిగ సేవా సమితి నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలుకూరు, ఆలుదుపల్లి, బసవన్నపల్లి, హేమావతి, శివరం గ్రామ పంచాయతీలలో బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్కలిగ సేవా సంఘం నాయకులు ఆలుకూరు కాంతరాజు, నాగోనపల్లి మంజునాథ్, రఘు, ఆలుకూరు సురేష , త్రిలోక్‌నాథ్, రాజు, శివకుమార్, మంజు, వీరకేతయారప్ప, తిప్పేస్వామి, గాది దానేగౌడ్, నగేష , మల్లేష్, గిరి, నాగభూషణం, అనిల్‌కుమార్, హేంజారప్ప, శాంతకుమార్, లింగరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలుకూరు కాంతరాజు, నాగోనపల్లి మంజునాథ్, రఘులు మాట్లాడుతూ వక్కలిగల ఆరాధ్య దైవంగా భావించే కెంపే గౌడ, బనమయ్యల జయంత్సోవాలను సాయివిద్యానికేతన్ పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసినందున మండలంలోని కుంచిటిగ వక్కలిగ సోదరి సోదరీమణులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

## ఈ నెల 26న కౌశల్ క్విజ్, పోస్టర్ కాంపిటీషన్ పోటీలు



ప్రధానోపాధ్యాయులు చెన్న క్రిష్ణా రెడ్డి

**కొత్తచెరువు, నవంబర్ 24, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన కొత్తచెరువులోని జడ్పి బాలుర ఉన్నత పాఠశాల నందు భారతీయ విజ్ఞాన మండలి విజయవాడ మరియు ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్న కౌశల్-2022లో భాగంగా జిల్లా స్థాయి కౌశల్ క్విజ్, పోస్టర్ కాంపిటీషన్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెన్నక్రిష్ణారెడ్డి ఒక ప్రకనటలో తెలియజేశారు. ఈ కౌశల్ క్విజ్ పోటీలకు మండల స్థాయిలో ఎంపికైన 36 పాఠశాలలు, పోస్టర్ కాంపిటీషన్‌కు ఎంపికై 27 పాఠశాలలు తమ పాఠశాల నుండి క్విజ్ పోటీకి ముగ్గురు విద్యార్థులను, పోస్టర్ కాంపిటీషన్‌కు ఇరువురు విద్యార్థులను, ఒక ఉపాధ్యాయునితో పాటు ఉదయం 09:00 గంటలలోపు హాజరు కవాల్సి ఉంటుందన్నారు. శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా 325 ఉన్నతపాఠశాలలకుగాను, 148 పాఠశాలలు మాత్రమే పాఠశాల స్థాయి క్విజ్ పోటీలలో పాల్గొన్నారని, వీరిటి నుండి మొదటి 36 స్థానాలు సాధించిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేసి,జిల్లా స్థాయి పోటీలలో మొదటి మూడు స్థానాలు సాధించిన పాఠశాలలను రాష్ట్ర స్థాయికి ఎంపికచేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా పోస్టర్ కాంపిటీషన్‌కు జిల్లా వ్యాప్తంగా 27 పాఠశాలలే ఆన్‌లైన్ నందు నమోదు చేసుకున్నారని, కావున జిల్లా స్థాయికి ఆ 27 పాఠశాలలు మాత్రమే హాజరు కావాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 8074917923, 7382291416, 9440738447 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

# దిగులు వద్దు ఎంతటి కష్టానికైనా భరోసాగా నేనున్నా

**- పలువురు కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించిన పల్లె**



ప్రజలతో మమేకమైన పల్లె

**ఓబుళదేవరచెరువు, నవంబర్ 24, ప్రభాతవార్త**

టిడిపి నాయకులు, కార్యకర్తలు తమ కుటుంబ పెద్దను కోల్పోయి దిగులు పడవద్దని ఎంతటి కష్టనష్టానికైనా ఎల్లవేలలా భరోసాగా నేనున్నానని మాజీ మంత్రి, పుట్టపర్తి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ పల్లె రఘునాథరెడ్డి స్పష్టం చేశారు. ఇందులో భాగంగా గురువారం మండలంలోని పలుగ్రామాలలో కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలిచి



బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందచేస్తున్న పల్లె

హితోదికంగా ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు చింతమానుపల్లి పంచాయితీ చెందిన తేదాపా నయాకులు ఇండ్లూరి రామచంద్రప్ప భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబాని పరామర్శించి ఓదార్చారు. అనంతరం మల్లెమల్లెవాండ్లపల్లికి ఆశోక్ మృతి చెందిన విషయం తెలుసుకుని కుటుంబ సభ్యులను పరామర్శించి కొంత ఆర్థిక సాయం అందించారు. దీంతో పాటు అదే గ్రామంలో నరేష్ అనే వ్యక్తికి కాలు విరిగి ఇబ్బందులు పడుతుంటే అతనికి కొంత ఆర్థికసాయం అందించారు. కొండకమర్లకు చెందిన భూపతి శ్రీనివాసులు ఆవు మరణించిన విషయం తెలుసుకుని రూ 5 వేలు ఆర్థిక సాయం అందించారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న రహంతుల్లాకు రూ 5 వేలు ఆర్థిక సాయం అందించారు. దీంతో పాటు కొండకమర్ల గ్రామంలో ఈశ్వరమ్మతల్లి దీక్షా మాలను ధరించిన ఐదు మంది భక్తురాల్లు రూ 5 వేలు అందించారు. దిగువపల్లికి చెందిన వెంకటరమణ ఎందల బండి ప్రమాదంలో గాయపడగా పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. గాజుకుంటపల్లికి చెందిన టైలర్ శంకర ఇటీవల హర్ట్‌అటాక్‌తో మరణించిన విషయం తెలుసుకుని వారి కుటుంబ సభ్యులను ఓదార్చి రూ 5 వేలు అందచేశారు. అలాగే ఇదే గ్రామానికి చెందిన అచ్చెమ్మ ఇటీవల మృతి చెందగా ఆమె కుమారునికి రూ 5 వేలు ఆర్థిక సాయం అందచేశారు. గాజుకుంటపల్లిలో రైతులను, మహిళలను ఆపా యయంగా పలుకరించి వారితో పల్లె మమేకమయ్యారు. పల్లె వెంట టిడిపి నాయకులు జాకీర్, రాజారెడ్డి, షఫీ, బడిశం రామాంజినేయులు, రంగారెడ్డి, గిరినాథ్‌రెడ్డి, జయచం ద్రారెడ్డి, కొండే ఈశ్వరయ్య, అంజినప్ప, ప్రసాద్, ఎస్ గంగాద్రి, అంజనేయులు, చంద్రాయుడు, షాను, బడిశం సురేష్, సుకేష్‌నాయుడు, వినోద్‌నాయుడు, పీట్ల సుధాకర్, చంద్రశేఖర్‌రెడ్డి, అంజినరెడ్డి, రామాంజినేయులు తదితరులు ఉన్నారు.

# భూముల్ని రైతులకు స్వాధీనం చేయండి



పత్రికాగోష్టిలో మాట్లాడుతున్న యు.బసవరాజ్ తదితరులు

**బళ్లారి, నవంబర్24, ప్రభాతవార్త**

భారీ పరిశ్రమల ఏర్పాటుకై బళ్లారికి సమీపంలో గల కుడితిని చుట్టుపక్కల ప్రాంతాల్లో రైతుల నుంచి స్వాధీనపరుచుకున్న వేలాది ఎకరాల భూముల్ని తిరిగి స్వాధీనం చేయాలని డిమాండ్ చేస్తూ డిశంబర్ 7న కుడితిని నుంచి పాదయాత్ర చేపట్టనున్నట్లు సీపీఐ(ఎం( నాయకుడు యు.బసవరాజు తెలిపారు. గురువారం పత్రికాగోష్టిలో మాట్లాడిన ఆయన కుడితిని చుట్టుపక్కల రైతుల నుంచి పరిశ్రమల కోసం భారీగా రైతుల నుంచి తక్కువ ధరతో భూముల్ని స్వాధీన పరుచుకున్నారని, అయితే ఇంతవరకు ఒక్క పరిశ్రమ కూడా స్థాపన జరగకపోవడంతో రైతులకు అన్యాయం జరిగిందని, స్వాధీనపరుచుకున్న భూముల్ని తక్షణం రైతులకు అప్పగించాలని పేర్కొన్నారు. 2010లో పరిశ్రమల స్థాపనకై 10 వేల హెక్టార్లకు పైగా రైతులకు చెందిన భూముల్ని స్వాధీన పరుచుకున్న కేఐడీబీ(కర్ణాటక ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బోర్డు) 12 సంవత్సరాలు గడిచినా పరిశ్రమల స్థాపన జరగలేదని ఆరోపించారు. అప్పట్లో రైతుల్ని వంచించి ధర నిర్ణయించారని, రూ.8,12,016 ఎకరా భూమి చొప్పున కేఐడీబీ రైతులకు చెల్లించి కొనుగోలు చేసిందని, కోర్టు ఈ ధర నిర్ణయంపై కేఐడీబీని ప్రశ్నించిందని, కోర్టు ఆదేశానుసారం రైతుల భూములకు సరైన ధర నిర్ణయించలేదని, ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం ధరలు గమనిస్తే ఎకరాకు రూ.65 లక్షలు చొప్పున ఎకరాకు ధర పలుకుతుందని చెప్పారు. వ్యవసాయం లేక, ఉద్యోగ, ఉపాధి లేక పరిశ్రమల కోసం భూములిచ్చిన రైతులు తీవ్ర సంకష్టంలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. దీనిపై జిల్లాను పాలించే మంత్రులు, ఎమ్మెల్యేలు మాత్రం మౌనం వహించడం వెనక ఆంతర్యం ఏమిటో తెలియదని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వాన్ని నిలదీసేందుకు తాము విడతలవారీగా రైతులచే పోరాటం చేపట్టినట్లు, డిశంబర్ 6న మూడో విడత పోరాటంగా మోటార్ బైకు ర్యాలీ, డిశంబర్ 7న బళ్లారికి పాదయాత్ర చేపడుతున్నట్లు చెప్పారు. జిల్లా మంత్రి శ్రీరాములు ఇటీవలే నగరంలో బీజేపీ ఎస్టీ బృహత్ సమావేశం నిర్వహించారని, నిజానికి ఆయన నుంచే ఎస్సీ, ఎస్టీవర్గాలకు చెందిన ప్రజలు వంచనకు గురయ్యారని, ఇందుకు సాక్షి కుడితిని చుట్టుపక్కల భూముల్ని తక్కువ ధరతో మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డి పరిశ్రమకు కేఐడీబీ ద్వారా కేటాయించడమేనని, అందులో మంత్రి శ్రీరాములు పాత్ర కూడా ఉన్నదని ఆరోపించారు. ఈ సందర్భంలో నాయకులు జె.సత్యబాబు, వి.ఎస్.శివశంకర్, పోలప్ప, విరుపాక్షప్ప, జంగ్లీసాబ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్మశాన భూమి అభివృద్ధి పరచాలని వినతి

**బళ్లారి, నవంబర్24, ప్రభాతవార్త**



జిల్లాధికారికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నగరంలోని సంగనకల్ రోడ్డులో ఎన్‌హెచ్ 132 రహదారిలో గల శ్మశాన భూమిని అభివృద్ధి పరచాలని, మృతదేహాలు దహనం చేసేందుకు వీలుగా కట్టడం నిర్మించాలని, శ్మశానంలో విద్యుత్, గ్యాస్ ఆధారిత పరికరాలు ఏర్పాటు చేయాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని జిల్లాధికారి పవన్‌కుమార్ మాలపాటికి యువసేన సోషల్ యాక్షన్ క్లబ్ గురువారం విజ్ఞప్తి చేసింది. సదరు శ్మశాన భూమిని నగరంలోని సత్యనారాయణపేట, గాంధీనగర్, పార్వతీనగర్, కప్పగల్ రోడ్డు తదితర చుట్టువ క్కల ప్రాంతాల్లో నివసిస్తున్న సార్వజనికులు ఉపయోగించుకుంటున్నారని, సుమారు ఐదు సంవత్సరాల క్రితం నాటి జిల్లాధికారి రాంప్రశాత్ మనోహర్ యువసేన అందజేసిన వినతి పత్రాన్ని స్వీకరించి హైదరాబాద్-కర్ణాటక గ్రాంటు నిధులతో పాడైపోయిన శ్మశాన భూమిలో సిమెంట్ రోడ్డును నిర్మించి చుట్టూ కాంపౌండ్ గోడ నిర్మాణం జరిపి రోడ్లకు ఇరువైపులా చెట్లను నాటి మృతదేహాలు ఖననం చేసేందుకు ఒక కట్టడాన్ని నిర్మించారని చెప్పారు. రెండో విడత నిధులు జారీచేసేలోగా సదరు జిల్లాధికారి బదిలీ అయ్యారని, మిగిలిన అభివృద్ధి పనులు అలాగే మిగిలిపోయాయని, ఆ పనులను చేపట్టి శ్మశానంలో సార్వజనికులకు అన్నివిధాలుగా అనుకూలమయ్యే కనీస సౌలభ్యాలు కల్పించాలని అధ్యక్షుడు మేకల ఈశ్వర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన జిల్లాధికారి పవన్‌కుమార్ మాలపాటి దీనిపై పరిశీలన జరిపి ఆ మేరకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ప్రభుత్వ స్థలాలు కబ్జా చేస్తే కఠిన చర్యలు

-తహసిల్దార్ రవీనాయక్



ప్రభుత్వ స్థలాలను పరిశీలిస్తున్న తహసిల్దార్, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది

**నంబులపూలకుంట, నవంబర్ 24, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని ప్రభుత్వ స్థలాలను స్థానిక తహసిల్దార్ రవినాయక్ గురువారం పరిశీలించారు. మండలంలో సోలార్ హబ్ రావడం వల్ల ప్రభుత్వ స్థలాలకు డిమాండ్ పరిగింది. అదేవిధంగా ప్రభుత్వస్థలాల కొరత ఉన్నందున రెవెన్యూ అనుమతి లేకుండా ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసినట్లైతే కఠినమైన చర్యలు తీసుకుంటామని తహసిల్దార్ తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ స్థలాలను గుర్తించి ఈ ప్రాంతంలో ఎలాంటి కట్టడాలు చేయకూడదని ఆర్‌డిటి ట్రస్ట్‌వారు ప్రభుత్వ స్థలాలు అడగడం జరిగిందని, వాటిని కూడా త్వరలో గుర్తిస్తామని , ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసిన వారిని విచారించి హెచ్చరిక జారీ చేశామని, అలాగే వ్యవసాయ భూమిని వ్యవసాయ యాత్ర భూమిగా తయారు చేసి లేఔట్ వేసి అమ్మడం జరిగింది. అలా లేఔట్లు వేసి అమ్మిన యజమాని ప్రభుత్వ అభివృద్ధి కొరకు కొరత స్థలం కేటాయించి అలా ఎందుకు కేటాయించలేదని మండల పంచాయతీ కార్యదర్శి పిలిపించి వ్యవసాయ భూమిని వ్యవసాయ యాత్ర భూమి మార్చిన వారి పరిశీలించి మీ అనుమతి లేకపోతే ఎలా అని, వివరాలు త్వరలో మాకు అందజేయాలని హెచ్చరించడం జరిగింది. మండల కేంద్రంలో పలు లబ్ధిదారులు ఇంటి పట్టాలు కావాలని అడగగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ధరఖాస్తులు రెవెన్యూ కార్యాలయంలో ఇచ్చినట్లైతే త్వరలో వాటిని పరిశీలించి అని అర్హత అనుమతులు ఉంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటి పట్టాలు ఇస్తామని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బందిొ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా స్త్రీ హింస నిర్మూలన దినోత్సవం



బస్టాండ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**అమడగూరు, నవంబర్ 24 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోగురువారం అంతర్జాతీయ స్త్రీ హింస నిర్మూలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీచౌడేశ్వరి కళ్యాణమండపం నుండి పురవీధుల గుండా మహిళలు, ఆర్డీటి సిబ్బంది ప్లకార్డులు చేతబూని నినాదాలు చేస్తూ బస్టాండ్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపిడిఒ షేక్‌నసీమా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ స్త్రీ లేనిది జననం లేదని, ప్రతి ఇంటికి వెలుగు ఇల్లాలేనని బాల్య వయసులో బాలికలకు వివాహాలు చేయకూడదని పూర్తిగా రద్దు చేయాలని అలా ఎవరైనా చేపడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో స్త్రీలకు రక్షణ కరువైందని ప్రభుత్వం వాటిపై ప్రత్యేక శ్రద్ధ వహించి వాటిని వెంటనే అరికట్టాలన్నారు. ప్రతి ఇంటికి ఒక ఆడబిడ్డ వుండాలని ఆ ఇంటికి అప్పుడే కళ నెరవేరుస్తుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా స్త్రీలను గౌరవించడం మన భారతీయ సంస్కృతి సంస్కారమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, ఎటిఎల్ వేమయ్య, సిబ్బంది మధు, సురేష్, గంగప్ప, సలీం, వెంకటేష్, గంగాద్రి, రాజశేఖర్, ఎస్‌టిఎల్ కిష్టప్ప, తదితర ఆర్డీటి సిబ్బంది, మండలంలోని మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక



ఎంపికైన యశ్వంత్‌కుమార్

**ముదిగుబ్బ, నవంబర్ 24 ప్రభాతవార్త**

అనంతపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అండర్-17 విభాగం యోగా పోటీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో ముదిగుబ్బ మండలం ఉప్పలపాడు ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న యశ్వంత్‌కుమార్ యోగాలో రాణించి రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల పిఇటి అనురాధ తెలిపారు. పాఠశాల నుండి రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక కావడంతో ప్రధానోపాధ్యాయులు బాబు, పిఇటి అనురాధ విద్యార్థిని అభినందించారు.

# పార్థీవ దేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే



పార్థీవ దేహానికి నివాళర్పిస్తున్న ఎమ్మెల్యే పి.వి.సిద్దారెడ్డి

**తలుపుల,నవంబర్24,ప్రభాతవార్త**

మండలపరిదిలోని బట్రేపల్లి గ్రామానికి చెందిన వైయస్సార్ పార్టీ కార్యకర్త బయన్న అనారోగ్యంతో మృతి చెందటంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పి.వి.సిద్దారెడ్డి పార్థీవ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు.అధైర్యపడకండి అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంపీపి మహ్మద్ రఫి.నాయక్,స్థానిక సర్పంచ్ వెంకటనారాయణ,గాండ్లపెంట ఎంపీపి జగన్,మాజీ సర్పంచులు ఫయాజ్ అహమ్మద్,కుర్లి శివారెడ్డి,తదితర వైయస్సార్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు స్త్రీ హింస నిర్మూలనపై అవగాహన

**ముదిగుబ్బ, నవంబర్ 24 ప్రభాతవార్త**

దేశంలో స్త్రీలపై జరుగుతున్న హింసలు నిర్మూలించే విధంగా స్త్రీ హింస నిర్మూలన దినోత్సవం సందర్భంగా బాలాజీ కళ్యాణమండపంలో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 నుండి ఆర్డీటి కార్యాలయం నుండి బస్టాండ్ సర్కిల్ వరకు ప్రభుత్వ బాలికల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం ఆర్డీటి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు.

# 27న ఉచిత వైద్య శిబిరం

**నంబులపూలకుంట, నవంబర్ 24, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని నాగార్జున పాఠశాలలో ఈ నెల 27వ తేది ఆదివారం ఉదయం 9 గంటల నుండి మావనతా స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుంది. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని మండలంలోని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

# జగనన్న పాలనతో అంతా సుభిక్షం

-చెరువులకు నీరు విడుదల చేసిన ఏపి విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి



నీరు విడుదల చేస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

**పుట్లూరు, నవంబర్ 24 ప్రభాతవార్త**

జగనన్న పాలనలో రాష్ట్రమంతా వర్షాలు పడి అంతా సుభిక్షంగా వుందని ఏపి విద్యాసలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. మండలంలోని సుబ్బరాయసాగర్ నుండి పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి చెరువులకు గురువారం ఆయన నీరు వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శింగనమల నియోజకవర్గం నీటి వనరులతో కళకళలాడుతోందని సంతోషం వ్యక్తం చేశారు. చెరువులు, వాగులు, వంకలు నీటితో నిండుగా వుండేలా ప్రణాళికలు వేస్తున్నామని పలు ప్రతిపాదనలు ఎమ్మెల్యే పంపించారని తెలిపారు. చాలా వరకు ఉన్నతాధికారులతో మాట్లాడి జగనన్న మంచి మనసు కారణంగా నీళ్లు, నిధులు సాధించుకువచ్చామన్నారు. నియోజకవర్గంలోని రైతులు ఆర్థికంగా ఎదగాలని, సత్యుకారులకు ఆదాయం రావాలని, ప్రజలు సంతోషంగా వుండాలనేది తమ అభిమతమని ఆయన తెలిపారు. ఈ మూడున్నరేళ్లలో శింగనమల నియోజకవర్గం అన్ని రకాలుగా ముందడుగు వేసిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి భూమిరెడ్డి రాఘవరెడ్డి, వైసిపి నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, ఇఇ వెంకటరమణారెడ్డి, డిఇ సేవ్లానాయక్, ఎఇ ఫణీంద్ర, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



రెడ్డిసేవా సంఘం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కస్తున్న దృశ్యం

**యాడికి, నవంబర్ 24 ప్రభాతవార్త**

ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జయంతి సందర్భంగా రెడ్డి సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని కోటరోడ్డులో వున్న సంఘం కార్యాలయం ఆవరణలో రెడ్డి సేవా సంఘం నూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం అధ్యక్షులు గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు నితిన్‌రెడ్డి, మండలంలోని వివిధ గ్రామాల నుండి రెడ్డి సోదరులు పాల్గొన్నారు. రెడ్డి సేవా సంఘం అధ్యక్షులు మహానందరెడ్డి మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామానికి సంఘం సేవలు విస్తరింపచేయాలనే మహోన్నత ఆశయంతో ఈ ఆవిష్కరణ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గంగలకుంట నరేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్డి సోదరులందరూ రాజకీయ పార్టీలకు అతీతంగా ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# రోడ్డుపై వరినాట్లు నాటి సిపిఎం నిరసన

**పుట్లూరు, నవంబర్ 24 ప్రభాతవార్త**



రోడ్డుపై వరినాట్లు వేస్తూ నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

మండలంలోని మడ్డిపల్లి, మడుగుపల్లి గ్రామాల మధ్య వున్న రహదారిపై వరినాట్లు వేసి సిపిఎం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ మండలంలో దెబ్బతిన్న రహదారుల స్థానంలో కొత్త వాటిని వేస్తామని శంకుస్థాపనకే పరిమితమయ్యాయన్నారు. గుంతలమయమైన ఈ రహదారిలో వెళ్లాలంటే ప్రజలకు చాలా ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా స్పందించి కొత్తగా రహదారిని ఏర్పాటు చేయాలన్నారు. లేకుంటే ఆందోళన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రామాంజినేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సూరి, మహిళా సంఘం నాయకులు మల్లేశ్వరి, నారాయణమ్మ, గ్రామస్తులు ఆది, భారతి, ఓబుళమ్మ, రమణమ్మ పాల్గొన్నారు.

# ఘనంగా మహిళా హింస నిర్మూలన దినోత్సవం

**యాడికి, నవంబర్ 24 ప్రభాతవార్త**



సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం సమావేశపు భవనంలో గురువారం ఆర్డీటి ఆధ్వర్యంలో మహిళా హింస నిర్మూలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ అలెగ్జాండర్, ఎంపిడిఒ వెంకటేష్, ఆర్డీటి అధికారులు హింస గురించి, మహిళల పట్ల అనుసరించాల్సిన విషయాలపై అవగాహన కల్పించారు. అంతకుముందు విద్యార్థులచేత ర్యాలీ నిర్వహించారు. మహిళల గృహ హింస నశించాలి, మహిళల చైతన్యం వర్ధిల్లాలి అంటూ నినాదాలతో ర్యాలీ చేపట్టారు. అనంతరం ఎంపిడిఒ సమావేశపు భవనం ఆవరణలో ఆర్డీటి ఆధ్వర్యంలో మహిళలకు ఆటలు నిర్వహించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ స్త్రీ గౌరవింపబడితే ఆ ప్రభావం రాష్ట్రం, దేశం మీద పడుతుందన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు వారి వారి మాటతీరును అలాగే అవసరమైతే ఎలాంటి సమస్యను ఎదుర్కొనేందుకు అయినా సిద్ధపడాలని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న దిశ చట్టంపై ప్రతి ఒక మహిళ అవగాహన కలిగి వుండాలని వారు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటి అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

# వైసిపి నాయకున్ని పరామర్శించిన ఎమ్మెల్యే



గాయపడిన వైసిపి నాయకున్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

**తాడిపత్రిఅర్బన్, నవంబర్ 24 ప్రభాతవార్త**

తాడిపత్రి పట్టణంలో టిడిపి నాయకులు వైసిపి నాయకులపై చేసిన దాడిలో గాయపడి అనంతపురం సవేరా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైసిపి నాయకులు గోరాహాజీని గురువారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు వున్నారు.

# సజావుగా మండల సర్వసభ్య సమావేశం

-పలు శాఖల అధికారులు డుమ్మా



ఎఒతో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి ప్రతాప్‌రెడ్డి

**యల్లనూరు, నవంబర్ 24 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం ఎంపిపి గంగాదేవి అధ్యక్షతన ఇన్‌చార్జ్ ఎంపిడిఒ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది. ఈ సమావేశానికి జెడ్‌పిటిసి



హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

భోగాతి ప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేసే విధంగా అందరూ చర్యలు తీసుకోవాలని అప్పుడు గ్రామాల్లో సమస్యలు పరిష్కారం చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చేయాలన్నారు. మండలంలోని కల్లూరు, వెన్నపూసపల్లి గ్రామాల్లో ఖాళీగా వున్న ఎంపిఇఒ పోస్టులు భర్తీ చేయాలన్నారు. ప్రతి సమావేశానికి కొన్ని శాఖల అధికారులు హాజరవుతున్నారని మరికొన్ని శాఖల అధికారులు డుమ్మా కొడుతున్నారన్నారు. ప్రభుత్వం పిల్లల కోసం నాడు - నేడు కింద పాఠశాలల్లో మంచి వసతులు కల్పిస్తూ పిల్లలకు జగనన్న గోరుముద్ద వంటి ఎన్నో మంచి కార్యక్రమాలు చేస్తూ ముందుకు అడుగులు వేస్తుంటే విద్యలో మాత్రం మండలం వెనుకడుగులో వుందన్నారు. పాఠశాలలో స్టడీ అవర్ ఏర్పాటు చేసి పిల్లలు బాగా చదివి ఉత్తీర్ణులయ్యేలా చూడాలని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఎఒ రామకృష్ణుడు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 31 వేల ఎకరాల్లో 8938 మంది రైతులు ఈ క్రాప్ బుకింగ్ చేసుకున్నారన్నారు. వంద శాతం ఈ క్రాప్ బుకింగ్ పూర్తయిందన్నారు. అలాగే ఆయా శాఖల అధికారులు ఆయా సంక్షేమ పథకాలపై నివేదికలు చదివి వినిపించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ రమాదేవి, ఇఒఆర్‌డి విజయశేఖర్‌నాయుడు, రెండవ వైస్‌ఎంపిపి వెంకటరంగయ్య, ఎంపిటిసి తిమ్మార్తి, ఆదినారాయణారెడ్డి, లక్ష్మీదేవి, సిద్దమ్మ, సర్పంచులు రామాంజులరెడ్డి, పెద్దఓబులమ్మ, ఎంఇఒ చంద్రశేఖర్, పంచాయతీ జెఇ నరేంద్ర, డాక్టర్ లోకేష్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ సుప్రజరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు బషీర్ పాల్గొన్నారు.

# ఆ "మలుపు" ప్రమాదాలకు పిలుపు

-నిత్యం వాహనాల రాకపోకలతో ప్రజలు బెంబేలు

-ప్రమాదాల బారిన పడకుండా స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



ప్రమాదకరంగా మారిన మలుపు

**పుట్లూరు, నవంబర్ 24 ప్రభాతవార్త**

ఆ మలుపు ప్రమాదాలకు నిలయంగా మారుతోందని మండల కేంద్రంలోని పి.చింతలపల్లి వీర బ్రహ్మేంద్రస్వామి కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. బాలాపురం గ్రామ సచివాలయం సమీపంలో ఎక్కువ మలుపు వుండడంతో పాటు రహదారి చాలా తగ్గు వుండడంతో పంచముఖ ఆంజనేయస్వామి, వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయాలకు దర్శనానికి వచ్చే భక్తులు, కాలనీవాసులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని తిరుగుతున్నారు. ఈ మధ్యకాలంలో టిప్పర్లు, ట్రాక్టర్లు అధికంగా తిరుగుతుండడంతో ఏ సమయంలో ఏమి ప్రమాదం సంభవిస్తోందోనని భయం గుప్పిట్లో తిరుగుతున్నారు. గత ఏడాది ఆ మలుపు వద్ద ఓ ట్రాక్టర్ అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లి ప్రమాదం సంభించింది. ఇలాంటి సంఘటనలు కోకొల్లలు, చిన్న పిల్లలు పాఠశాలకు వెళ్లే సమయంలో రోడ్డు దాటుకుని వెళ్లాలంటే చాల అవస్థలు పడుతున్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగని ప్రదేశాల్లో అధికారులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారని, ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకుండా ఉండడం బధాకరమని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆ మలుపు వద్ద వేగం నిరోధించేందుకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రజలు ప్రమాదాలబారిన పడకుండా కాపాడాలని కోరుతున్నారు.

# అత్యవసర పరిస్థితుల్లో మహిళకు రక్తదానం

**యాడికి, నవంబర్ 24 ప్రభాతవార్త**



రక్తదానం చేసిన లక్ష్మినారాయణ

నార్పల మండలం బొందలేడు గ్రామానికి చెందిన జ్యోతి ఆర్డీటి ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఏ పాజిటీవ్ రక్తం అవసరమై నాలుగు రోజుల నుండి ఇబ్బంది పడుతున్న సమయంలో యాడికి మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్‌ను సంప్రదించారు. ప్రెసిడెంట్ బండారు బాలకృష్ణ తాడిపత్రిలోని మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ సభ్యుడు వి.లక్ష్మినారాయణకు విషయం తెలియచేశారు. తాడిపత్రి నుండి మోటర్‌సైకిల్‌పై బత్తలపల్లి ఆర్డీటి ఆసుపత్రికి చేరుకుని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె భర్త బయన్న అత్యవసర సమయంలో ఆదుకున్నందుకు లక్ష్మినారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఐదు రోజుల నుండి ప్రయత్నం చేస్తున్నా ఏ పాజిటీవ్ స్టాక్ లేకపోవడంతో రక్తదాతలు లభించకపోవడంతో ఇబ్బంది పడుతున్న సమయంలో ఫౌండేషన్ సభ్యులు సహాయ సహకారాలు మరువలేనివని ఆయన తెలిపారు. రక్తం అవసరమైన వారు రక్తదానం చేయాలనుకున్న వారు 9912099782, 8686808333 నెంబర్లకు సంప్రదించాలని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు.

# సాయినాథునికి పంచామృతాభిషేకాలు



**యల్లనూరు, నవంబర్ 24 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని కస్తూరిబా గురుకుల పాఠశాల ఎదురుగా నూతనంగా నిర్మించిన శ్రీషిరిడిసాయిబాబా ఆలయంలో గురువారం విశేషపూజలు నిర్వహించారు. ఉదయం బాబాకు పంచామృతాభిషేకాలు, అర్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా మధ్యాహ్నహారతి, కాకడాహారతి తదితర పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని బాబాను దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం పల్లకి సేవను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

# దాడి చేశాడని ఫిర్యాదు

**పుట్లూరు, నవంబర్ 24 ప్రభాతవార్త**

మండలంలోని పి.చింతలపల్లి గ్రామంలో హరికృష్ణారెడ్డి అనే రైతు పొలం గుండా వెళ్లే దారిలో వున్న గేటు అదే గ్రామానికి చెందిన కేశవరెడ్డి వేయకుండా వెళుతున్నాడని దీంతో పంటను పశువులు మేస్తున్నాయని గేటు ఎందుకు వేయకుండా వెళుతున్నావని కేశవరెడ్డిని అడిగినందుకు అతను హరికృష్ణారెడ్డి తలపై కర్రతో దాడి చేశాడు. దీంతో గాయపడిన హరికృష్ణారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

